www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 24 ఆగస్టు 2025

5

కాకినాడ



పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

ప్రజాశక్తి-కాజులూరు

రైతులు తమ పశువులను సురక్షత ప్రాంతాలకు తరలించాలని పశు సంవర్ధక శాఖ జిల్లా జెడి కృష్ణమూర్తి సూచించారు. శనివారం మండలంలోని పెదలంకలోని గోశాలను ఆయన సందర్శించి స్థానిక రైతులతో మాట్లాడారు. గోదావరి వరదలు ఉధతంగా వస్తుండడంతో లంక గ్రామాల్లోని రైతులు తమ పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని పశువులకు వ్యాక్సినేషన్ వేయించుకోవాలని సూచించారు. రైతులు తమ పశువులకు వ్యాధులు వచ్చాక కంటే ముందుగానే వ్యాక్సినేషన్ వేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ అంబేద్కర్, ఎడిఎ బ్రహ్మా వేద, స్థానిక పశు వైద్యులు సుధీర్ శామ్యూల్, చెక్క శ్రీరామ్, కోటేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

నిరాశ పరిచిన సిఎం పర్యటన

సమస్యలను విస్మరించిన చంద్రబాబు
ఏలేరు ఆధునికీకరణ ఊసెత్తని వైనం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి, సామర్లకోట

పెద్దాపురంలో శనివారం నిర్వహించిన సిఎం పర్యటన జిల్లా ప్రజలను నిరుత్సాహ పరిచింది. ఈ పర్యటనలో ప్రజా సమస్యల ప్రస్తావన ఎక్కడా రాలేదు. కనీసం జిల్లా ప్రధాన సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపైనా ఆయన పెదవి విప్పలేదు. ఏలేరు ఆధునికీకరణ, సుద్ధగడ్డ కాలువ పనులు, అతివృష్టి, అనావృష్టికి అన్నదాతలకు కలిగిన నష్టపరిహారం వంటి ప్రస్తావనలు ఎక్కడా లేవు. కాకినాడ స్మార్ట్ సిటీ ముంపు సమస్య పరిష్కారానికి చర్యలు, సెజ్‌లో పరిశ్రమల ఏర్పాటు వంటి దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఆశించిన జిల్లా వాసులకు అసంతృప్తే మిగిలింది. ముఖ్యమంత్రిగా పదవి చేపట్టి ఏడాదిన్నరలో రెండోసారి చంద్రబాబు జిల్లాలో అధికారికంగా పర్యటించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర, ప్రజా వేదిక కార్యక్రమాల్లో ఆయన ప్రసంగించారు. అనంతరం జరిగిన ర్యాలీలో పాల్గొన్నారు. పి4లో భాగంగా ఎంపిక చేసిన బంగారు కుటుంబాలను మార్గదర్శకులకు అప్పగించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సుమారు గంట ప్రసంగంలో ముఖ్యమంత్రి పూర్తిగా సూపర్ సిక్స్, పి4, రూ.330 కోట్లతో వేస్ట్ ఎనర్జీ విధానం వంటి అంశాలకే ప్రాధాన్యతనిచ్చారు.

ఏలేరు ఆధునికీకరణ మాట మరిచారు

ఏలేరు ఆధునికీకరణ లేకపోవడంతో ఈ జిల్లాలో 5 మండలాలకు చెందిన సుమారు 50 వేల మంది రైతాంగం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వరదల కారణంగా కాలువలు గండ్లు పడి పంటలను ముంచెత్తుతున్నాయి. అధ్వానంగా ఉన్న కాలువలను తాత్కాలిక పద్ధతిలో క్లోజర్ పనులు చేసినప్పటికీ అన్నదాతలకు అక్కరకు రాకుండా పోతున్నాయి. ఈ నేపథ్యంలో ఏలేరు ఆధునీకరణకు నిధులను కేటాయించాల్సి ఉంది. గతేడాది సెప్టెంబర్‌లో చంద్రబాబు మొదటిసారి ఈ జిల్లాకు వచ్చారు. స్వయంగా ఏలేరు రైతుల కష్టాలను వరద ప్రభావిత ప్రాంతాల్లో తిరిగి చూశారు. ఆ సందర్భంలో రైతాంగాన్ని ఆదుకుంటామంటూ హామీలు ఇచ్చారు. కానీ అధికారం చేపట్టి ఏడాదిన్నర కావొస్తున్నా ఈ ప్రాజెక్టు ఆధునీకరణ ఊసెత్తలేదు, పెద్దాపురం సభలోనైనా ఆధునీకరణ కోసం మాట్లాడతారని రైతులంతా ఎదురు చూశారు. కానీ చంద్రబాబు ప్రసంగం నిరాశ పరచడంతో వారు పెదవి విరిచారు. సుద్ధగడ్డ కాలువ విషయంలోనూ ఇలాగే వ్యవహరించారు. సంపద సృష్టి కోసం మాట్లాడారు కాని సెస్‌లో పరిశ్రమల స్థాపనపై పెదవి విప్పలేదు.



ర్యాలీలో పాల్గొన్న సిఎం చంద్రబాబు తదితరులు


వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబు

పెద్దాపురానికి పాత హామీలే...

2014 నుంచి 19 వరకు పాలించిన టిడిపి హయాంలో పెద్దాపురం ఎంఎల్ఎ చినరాజప్ప హోమ్ మంత్రిగా ఉన్నారు. అప్పట్లో ఆయన పెద్దాపురం సిహెచ్‌సిగా సేవలందిస్తున్న ఆసుపత్రిని 100 పడకల ఏరియా ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. తాజాగా మరోసారి 100 పడకల ఆసుపత్రి ప్రతిపాదనను ఎంఎల్ఎ రాజప్ప చంద్రబాబు ముందు ఉంచారు. దీంతో ఆయన ప్రైవేటు భాగస్వామ్యంతో ఆసుపత్రి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని సభలో మరోసారి హామీ ఇచ్చారు. పెద్దాపురం, సామర్లకోట పట్టణాలకు రూ.75 కోట్లతో ప్రజలకు ఇంటింటా కుళాయిల ఏర్పాటు ద్వారా రక్షిత త్రాగునీరు అందించేందుకు కృషి చేస్తామని చంద్రబాబు తెలిపారు. సామర్లకోటలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులకు కొత్త పథకం

మున్సిపల్ కార్మికులు, వారి కుటుంబాలకు సంక్షేమం, భద్రత అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. పెద్దాపురం సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం కోసం ప్రమాద, ఆరోగ్య బీమా స్కీమును ప్రారంభించారు. పట్టణాభివృద్ధి శాఖ, యాక్సిస్ బ్యాంక్ సంయుక్తంగా ఈ స్కీమును అమలు చేసేలా ఒప్పందం కుదిరింది. ఈ మేరకు ఇప్పటికే మున్సిపల్ కార్మికుల శాలరీ ప్యాకేజ్ ఖాతాలు ప్రారంభించారు. ఈ కొత్త ఆర్థిక సదుపాయం ద్వారా మున్సిపల్ కార్మికులకు గణనీయమైన భరోసా లభించనుంది. ప్రస్తుతం రాష్ట్రంలోని 123 అర్బన్ లోకల్ బాడీస్‌లో మొత్తం 55,686 మంది కార్మికులు సేవలందిస్తున్నారు. ఇప్పుడు ఈ స్కీమ్ ద్వారా వీరందరికీ ఈ బీమా సదుపాయం లభించనుంది. వీరిలో 39,170 మంది పబ్లిక్ హెల్త్ విభాగంలో ఉండగా, 16,516 మంది ఇతర విభాగాల్లో పని చేస్తున్నారు. వీరిలో శాశ్వత, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానంలో పని చేస్తున్న వారందరికీ ఈ పథకం వర్తించనుంది. ఇప్పుడు యాక్సిస్ బ్యాంక్‌తో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం ద్వారా ఈ ప్రయోజనాలు మరింత విస్తరించాయి. శాశ్వత ఉద్యోగులకు ఒక రూ.1 కోటి వరకు ప్రమాద బీమా, రూ.పది లక్షల లైఫ్ కవర్ లభించనుంది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రూ.20 లక్షల ప్రమాద బీమా, రూ.2 లక్షల లైఫ్ కవర్ సదుపాయం ఉంటుంది. కుటుంబ సభ్యులతో కలిపి మొత్తంగా రూ. 33 లక్షల వరకు ఆరోగ్య బీమా వర్తిస్తుంది. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు వైవివి.సత్యనారాయణ, ఎం.దుర్గలను సిఎం సత్కరించారు.

సిఎం చంద్రబాబుకు ఘన స్వాగతం

ముఖ్యమంత్రి చంద్రబాబుకు హెలిప్యాడ్ వద్ద ఘన స్వాగతం లభించింది. పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, పి.నారాయణ, కార్మిక శాఖ మంత్రి వి.సుభాష్, ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, ఎంపీలు సానా సతీష్‌బాబు, తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, జిల్లా ప్రత్యేకాధికారి జి.వీరపాండ్యన్, కలెక్టర్ షన్‌మోహన్ సగిలి, ఎస్‌పి జి.బిందుమాధవ్, ఎంఎల్ఎలు యనమల దివ్య, డి.సుబ్బరాజు, జ్యోతుల నెహ్రూ, వనమాడి వెంకటేశ్వరరావు, వి.సత్యప్రభ, పంతం నానాజీ, ఎన్.రామకృష్ణారెడ్డి, ఎంఎల్‌సి పి.రాజశేఖర్, కర్రి పద్మశ్రీ ఉన్నారు.



అధ్యక్ష తరహా పాలనకు బిజెపి కుట్ర

ప్రశ్నార్థకంగా ఎలక్షన్ కమిషన్ స్వతంత్రత
సెమినార్‌లో అర్ధశాస్త్ర నిపుణులు రాంభూపాల్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం ప్రతినిధి

దేశంలో అధ్యక్ష తరహా పాలనను తీసుకొచ్చే కుట్రలో భాగంగానే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ బద్ధంగా ఏర్పాటైన స్వతంత్ర వ్యవస్థలను ఒక్కొక్కటిగా నిర్వీర్యం చేస్తుందని అర్ధశాస్త్ర నిపుణులు వి.రాంభూపాల్ అన్నారు. తూర్పు గోదారి జిల్లా రాజమహేంద్రవరంలో 'రాజమహేంద్రి ఆలోచన వేదిక' ఆధ్వర్యంలో 'భారత ప్రజాస్వామ్యం - ఎన్నికల కమిషన్ స్వతంత్రత' అనే అంశంపై సంహిత డిగ్రీ కళాశాల ఆవరణలో శనివారం సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఉపాధ్యాయులు భీమయ్య అధ్యక్షత వహించారు. ముఖ్యవక్తగా రాంభూపాల్ హాజరై మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో లోపాలున్నప్పటికీ దీనిని సరిచేసుకుని పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడం పౌరుల కర్తవ్యం కావాలన్నారు. పార్టీల వారీగా దామాషా ఓటింగ్ విధానం అమలైతే ఎన్నికల నేపథ్యంలో జరుగుతున్న అవినీతి అక్రమాలకు అడ్డుకట్ట వేయొచ్చని తెలిపారు. రాష్ట్రంలో కొద్ది మంది ఎంఎల్ఎల అవినీతి అక్రమాలను ఈ సందర్భంగా ప్రస్తావించారు.

దేశవ్యాప్తంగా ఎలక్షన్ కమిషన్ తీరుపై చర్చ నడుస్తుందన్నారు. బీహార్, మహదేవపురంలో ఓటర్ల మార్పులు చేర్పులు ఆ వ్యవస్థ విశ్వసనీయతను ప్రశ్నిస్తున్నాయన్నారు. గత 11 ఏళ్లలో 12 రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో బిజెపి ఓడిపోయినప్పటికీ ప్రభుత్వాలను కూల్చి అధికారం చేపట్టిందని తెలిపారు. అయినా ఇసి జోక్యం చేసుకున్న దాఖలాలు లేవన్నారు. బీహార్ ఓటర్ల జాబితా నుంచి సుమారు 65 లక్షల మంది ఓటర్ల తొలగింపు, మహదేవపురంలో లక్షకు పైగా అక్రమంగా ఓట్లు చేర్పు వంటి పరిణామాలు బిజెపి రాజకీయ లక్ష్యం నెరవేర్చడానికి ఇసి దోహద పడిందనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయన్నారు. మరోవైపు బిజెపి ప్రధాన అజెండాలో భాగమైన ఎన్ఆర్‌సి, సిఎఎలను ఎస్ఐఆర్ పేరుతో దొడ్డిదారిన అమలు చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాన్ని తెలిపారు. దేశంలో అత్యధిక మంది జనాభాను ప్రవాసీలుగా చూపి మతతత్వ అజెండా అమలు చేసేందుకు యత్నిస్తున్నారన్నారు. రాజకీయ వ్యవస్థను ప్రణాళిక బద్ధంగా నిర్వీర్యం చేయడానికి బిజెపి ప్రభుత్వం నయా ఫాసిస్టు విధానాన్ని అమలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఆలోచన వేదిక కన్వీనర్ పిఎస్ఎన్.రాజు, నగర ప్రజలు, పలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న రాంభూపాల్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎస్ఎఫ్ఐ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గొల్లప్రోలు


విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన చలో కలెక్టరేట్ పోస్టర్‌ను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద శనివారం ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు సిహెచ్.లోవరాజు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. సంతోష్, హరి, చరణ్, పవన్, ప్రసన్న, వినయ్ పాల్గొన్నారు.

ఫెన్సింగ్ సెక్రటరీగా సుగుణా రెడ్డి

ప్రజాశక్తి-కాకినాడ

ఆలిండియా ఫెన్సింగ్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ సుగుణా రెడ్డి ఎన్నికయ్యారు. ఈ నెల 20న నైనిటాల్‌లో నిర్వహించిన ఆలిండియా ఫెన్సింగ్ అసోసియేషన్‌కు ఎన్నికలు నిర్వహించగా డాక్టర్ నల్లిమిల్లి సుగునా రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెఓలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎపి జాతీయ స్థాయిలో మంచి స్థానంలో నిలిచేలా తమ వంతు కృషి చేస్తానని, తనపై ఉన్న నమ్మకంతో ఇంతటి బహత్తర బాధ్యత అప్పగించినందుకు తన సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.

కార్టూ'నిజం'



అదానీ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి

ప్రజాశక్తి-కాకినాడ

రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లు, పారిశ్రామిక కార్మికులు అదానీ విద్యుత్ మీటర్లను వ్యతిరేకించాలని పలువురు పిలుపు ఇచ్చారు. కచేరిపేట సిఐటియు కార్యాలయంలో దువ్వా శేషబాబ్జి అధ్యక్షతన శనివారం ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్వహరించారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పప్పు ఆదినారాయణ, ఐఎఫ్‌టియు జిల్లా సహాయ కార్యదర్శి గుబ్బల ఆదినారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కెఎస్.శ్రీనివాస్, రైతు కూలీ సంఘం నాయకులు వల్లూరి రాజబాబు, ఐసిసిటియు రాష్ట్ర కన్వీనర్ గొడుగు సత్యన్నారాయణ, పంచాయితీ కార్మిక సంఘం నాయకులు రాఘవులు మాట్లాడారు. రాష్ట్రంలో అదానీ స్మార్ట్ మీటర్ల ద్వారా విద్యుత్ ఛార్జీల పెంపునకు కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందన్నారు. పేరుకు స్వచ్ఛందం అంటున్నా, ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార దుకాణాలకు నిర్బంధంగా బిగిస్తున్నారని అన్నారు. ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన విద్యుత్ ఛార్జీల తగ్గింపు హామీకి భిన్నంగా ప్రిపెయిడ్ స్మార్ట్ మీటర్ల బిగింపును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి వినియోగదారుని నుంచి అదాని స్మార్ట్ మీటర్‌కు రూ.18 వేలు దఫా దఫాలుగా వసూలు చేస్తారని, ఇప్పుడున్న మీటర్లు బాగా పనిచేస్తుండగా కొత్తగా అదానీ స్మార్ట్ మీటర్ బిగింపు దేనికని ప్రశ్నించారు. ఈ నెల 28న అన్ని మండల కేంద్రాల్లో బషీర్ భాగ్ కాల్పుల్లో మరణించిన విద్యుత్ అమర వీరులకు నివాళి అర్పించాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు టి.రాజా, జి.చిట్టిబాబు, పిఒడబ్ల్యు నాయకురాలు భవాని తదితరులు పాల్గొన్నారు.


రౌండ్ టేబుల్ సమావేశంలో చర్చిస్తున్న నాయకులు

మద్యపానం, సారా అనర్ధాలపై అవగాహన

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని హుస్సేన్‌పురం శ్రీవెంకటరామ ప్రైవేటు లిమిటెడ్‌లో శనివారం ఎక్సైజ్ అధికారులు మద్యం, సారాకు వ్యతిరేకంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం.కృష్ణకుమారి మాట్లాడుతూ మద్యం తాగడం వల్ల వచ్చే దుష్పరిణామాలపై ఏర్పాటు చేసిన కేర్ కమిటీ ఆధ్వర్యంలో, తక్కువ కాలంలో ఆరోగ్యంపై ఎక్కువ ప్రభావాలు చూపించే మద్యం తాగడంపై అవగాహన కల్పించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మద్యం వల్ల వచ్చే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. డిఎడిక్షన్ సెంటర్, నాటుసారా నిర్మూలన కార్యక్రమాన్ని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నార్త్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రామ్మోహనరావు, ఎస్ఐలు ఎన్ఎస్.వరహాలు, కె నరసింగరావు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణకుమారి

కూరటి కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి- తాళ్లరేవు

ప్రముఖ ఆర్ఎంపి వైద్యులు కూరటి నరసింహమూర్తి ఇటీవల మరణించడంతో ఆ కుటుంబాన్ని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ శనివారం పరామర్శించారు. వైద్యుని కుమారుడు వాసు, ఆయన సోదరులను పరామర్శించి సానుభూతి తెలిపారు. వారి వెంట మండల కో ఆప్షన్ సభ్యులు కురాటి శ్రీకృష్ణ, ఇంజరం సర్పంచ్ ముద్దన వెంకట శివరామ్‌ప్రసాద్, ఎంపిటిసి కోరుకొండ కిరణ్‌కుమారి, చంటి, సుంకరపాలెం ఎంపిటిసి గుత్తుల శ్రీను, కన్వీనర్ పెయ్యల కొండబాబు, కోరుకొండ నరసింహమూర్తి, మోర్త వెంకటరమణ, కోరుకొండ ప్రేమ్‌కుమార్, కాశి రాంబాబు, రేవు అప్పారావు, కూరటి సాగర్, వినకోటి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న మత్స్యకార గ్రామాల నాయకులు

మత్స్యకారులకు జీవితకాల పరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి- తాళ్లరేవు

తమ ప్రాంతంలో చమురు సంస్థలు కార్యకలాపాలు సాగిస్తున్నంత కాలం నష్ట పరిహారం ఇవ్వాలని మత్స్యకారులు డిమాండ్ చేశారు. గాడిమొగలోని రామాలయం వద్ద గాడిమొగ పంచాయతీకి చెందిన మత్స్యకారులు, ఆయా గ్రామాల పెద్దలు, కామాడి మాతరాజు, కొక్కిలిగడ్డ లోకేష్, సంగాడి ధర్మారావు, కె.మాతరాజు శనివారం విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం ఒఎన్‌జిసి గ్యాస్ లీకవడంతో సముద్ర జలాల్లో ఉన్న చేపలు, పీతలు మృత్యువాత పడ్డాయన్నారు. దీనివల్ల గాడేరు, నీళ్లరేవు, మందార కాలువ వంటి పిల్ల కాలువల్లో ఉన్న చేపలు సైతం నీటిపై తేలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. చమురు సంస్థలు నిర్మించిన గ్యాస్ పైప్ లైన్ వల్ల తరచూ ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. రిలయన్స్, ఒఎన్‌జిసి వంటి సంస్థలు కొద్ది కాలానికి మాత్రమే మత్స్యకారులకు నష్టపరిహారం అందిస్తున్నాయని, సముద్ర జలాల్లో గ్యాస్ లీక్ అవ్వడం వల్ల మత్స్య సంపద చనిపోవడంతో రెండేళ్ల వరకూ మత్స్య సంపద వృద్ధి కాదన్నారు. గ్యాస్ పైప్‌లైన్ వల్ల ప్రభావితమైన ఆయా గ్రామాల మత్స్యకారులందరికీ పరిశ్రమలు ఉన్నంతకాలం నష్టపరిహారం చెల్లించాలన్నారు.


సమావేశంలో పాల్గొన్న జన విజ్ఞాన వేదిక నాయకులు

శాస్త్రీయ సమాజ నిర్మాణానికి జెవివి కృషి

ప్రజాశక్తి-గొల్లప్రోలు

ప్రజలు శాస్త్రీయంగా ఆలోచించాలని, మానవత్వంతో జీవించాలని ఆకాంక్షిస్తూ శాస్త్ర ప్రచారంతో జన విజ్ఞాన వేదిక ప్రజలను చైతన్యవంతం చేస్తోందని జెవివి జిల్లా కమిటీ సభ్యులు ఎం.సూర్యనారాయణ, వి.సత్యనారాయణ రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలో నెంబర్ వన్ ప్రాథమిక పాఠశాలలో జెవివి సమావేశం అధ్యక్షులు ఏలేటి నాని బాబు అధ్యక్షతన నిర్వహించారు. జెవివి నాయకులు మాట్లాడుతూ సామాన్య ప్రజానీకంలో శాస్త్ర విజ్ఞాన ప్రచారంతో శాస్త్రీయ దక్పథాన్ని పెంపొందించి ఛాందస భావాలను అరికట్టాలన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల మౌలిక స్వరూప స్వభావాలపై సమగ్రమైన శాస్త్రీయ అవగాహనను పెంపొందించడంలో జన విజ్ఞాన వేదిక కృషి చేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో జెవివి మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షునిగా దాడి పద్మనాభం, ఉపాధ్యక్షునిగా ఎంవి.సత్యనారాయణ, అధ్యక్షునిగా ఏలేటి నాని బాబు, ప్రధాన కార్యదర్శిగా దాసం గోవిందరాజులు, చెకుముకి కన్వీనర్ అనిశెట్టి సీతారామరాజు ఎన్నికయ్యారు. జిల్లా సమత కన్వీనర్ సిహెచ్‌యుఆర్. మంగతాయారు, సిహెచ్.లోవరాజు, స్కూల్ హెచ్ఎం ధర్మరాజు పాల్గొన్నారు.

ఆదిత్యలో మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మెగా రక్తదాన శిబిరం నిర్వహించినట్టు కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్ఎన్.నాయుడు తెలిపారు. ఈ రక్తదాన శిబిరంలో ముఖ్య అతిథులుగా డాక్టర్ శిరంగు దొరబాబు, డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పాల్గొని విద్యార్థులకు రక్తదానంపై అవగాహన కల్పించారన్నారు. కాకినాడ ప్రభుత్వాసుపత్రి బ్లడ్ బ్యాంక్ వైద్యులు డాక్టర్ అనిల్ అద్భుతమైన సహకారం అందించారన్నారు. శనివారం మొత్తం 65 విద్యార్థులు రక్తదానం చేశారని, వీరిలో 23 మంది మొదటిసారి రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. కాకినాడ ఐడిఎ కార్యదర్శి డాక్టర్ అడ్డాల మాట్లాడుతూ ఒకసారి రక్తదానం చేయడం వల్ల ముగ్గురి ప్రాణాలు కాపాడవచ్చని, రక్తదానం చేయడం వల్ల రక్త కణాలు పొందిన వ్యక్తికి ప్రయోజనం చేకూర్చడమే కాక దాత ఆరోగ్యం కూడా మెరుగు పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ తేజేశ్వరరావు, కళ్యాణ్, ఐడిఎ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ వైద్యాధికారికి సన్మానం

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ పురస్కారం అందుకున్న పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సిహెచ్.సుష్మను వైసిపి నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. పార్టీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ మాట్లాడుతూ పిహెచ్‌సికి వచ్చిన స్వల్ప వ్యవధిలోనే డాక్టర్ సుష్మ రోగులకు మెరుగైన వైద్య సేవలందిస్తూ అందరి అభిమానాన్ని చురగొన్నారని తెలిపారు. పార్టీ రాష్ట్ర నాయకులు రావు చిన్నారావు మాట్లాడుతూ వృత్తి పట్ల ఆమెకు ఉన్న అంకితభవమే ఆమెను జిల్లా స్థాయిలో మంచిపేరు తీసుకురావడానికి దోహదం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో కారే శ్రీనివాసరావు, సర్పంచులు కర్రి చిన్నారావు, పి.దొరబాబు, గోపి, హరిబాబు, కుక్కల వెంకటరమణ, పందిరి బాపిరాజు, కొప్పిశెట్టి నాగేశ్వరరావు, కారే కిరణ్, వడిగే కనకేశ్వరరావు, బోడపాటి రాజేష్, ఆనాల గోవిందరావు పాల్గొన్నారు.

సైన్స్ ప్రయోగాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక రామారావుపేటలోని ఎసిటి సైన్స్ సెంటర్‌లో శనివారం విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై అవగాహన కల్పించారు. ఈ సైన్సు ప్రయోగాలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సైన్స్ పుస్తకాలలోని పాఠ్యాంశాలలో అంశాలపై విద్యార్థులు స్వయంగా ప్రయోగాలు చేయడం, ఆ ప్రయోగాల ద్వారా అవగాహన పెంచుకోవడంతో విద్యార్థులు ఎంతో ఆనందంగా ఈ ప్రయోగాలలో పాల్గొన్నారని సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజిక్స్ టీచర్ ప్రసాద్, హెడ్మాస్టర్ ఎం.రమేష్ పాల్గొన్నారు.

రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-తుని

రీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డి.పోలవరం గ్రామ సర్పంచ్ పలక సోమేశ్వరరావు అన్నారు. శనివారం గ్రామంలో రీ సర్వేను ఆయన పరిశీలించారు. గత ప్రభుత్వంలో కొన్ని గ్రామాలకు మాత్రమే రీ సర్వే నిర్వహించారని తెలిపారు. ప్రభుత్వ విప్, తుని ఎంఎల్ఎ యనమల దివ్య పలు గ్రామాల్లో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో అధిక సంఖ్యలో రైతులు భూ సమస్యలపై ఫిర్యాదు చేశారని తెలిపారు. దీనిలో భాగంగానే తుని మండలంలో హంసవరం, చామవరం, వల్లూరు, తేటగుంట, లోవ కొత్తూరు, కొలిమేరు, రేకవానిపాలెం గ్రామాల్లో రీ సర్వే నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ పి.సామోరు, డిటి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.


రీ సర్వేను పరిశీలిస్తున్న సర్పంచ్ సోమేశ్వరరావు

గోతుల రహదారికి మరమ్మతులు
ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-కోటనందూరు

ఈ నెల 18న ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన గోతుల రహదారి కథనానినికి యంత్రాంగం స్పదించింది. కోటనందూరు-తుని ప్రధాన రహదారిలో డి.పోలవరం వద్ద గోతులతో ప్రయాణికులు ప్రమాదాలు బారిన పడుతున్నారని కథనం ప్రచురితం అయ్యింది. దీంతో శనివారం డిపోలవరం గ్రామ సర్పంచ్ పలక సోమేశ్వరరావు గోతులకు మరమ్మతులు నిర్వహించారు. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా రహదారిని శుభ్రపరిచారు.

నేరాలు ఘోరాలు

పేకాడుతున్న ఏడుగురు అరెస్ట్

ప్రజాశక్తి - గోపాలపురం

పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేశామని ఎస్ఐ పి.మనోహర్ తెలిపారు. మండలంలోని వాదాలకుంట గ్రామంలో పేకాట ఆడుతుండగా శనివారం దాడులు చేశామన్నారు. ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.50,170 నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని గాడిమొగ గ్రామానికి చెందిన సంగాడి హరికృష్ణ కనబడడం లేదని ఆయన సోదరుడు మధుబాబు కోరంగి పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. హరికృష్ణ ఐటిఐ చదివి ప్రస్తుతం ఇంటివద్ద ఉంటున్నాడు. సుమారు 1 సంవత్సరం నుంచి హరికృష్ణ మానసిక పరిస్థితి బాగోలేనందున కాకినాడలోని జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ నెల 11న ఇంటి నుంచి కాకినాడ వెళుతున్నా అని చెప్పి బయటికి వెళ్లాడని, తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. హరికృష్ణ ఆచూకీ తెలిసినవారు సిఐ 9440796521కు, ఎస్ఐ 9440796558 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

శృంగార వల్లభునికి రూ 2.15 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

తిరుపతి గ్రామంలోని శ్రీశృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం రూ.2,15,699 ఆదాయం సమకూరిందని ఆలయ ఇఒ వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. వివిధ ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ.1,33,380, అన్నదానం విరాళాల ద్వారా రూ.64,368, కేశఖండన ద్వారా రూ.1800, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.15,990, కానుకల ద్వారా రూ.111 లభించినట్టు తెలిపారు. యాత్రికులకు ఉదయం పులిహోర ప్రసాదం, మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించామన్నారు. అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణచార్యులు, ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు, గ్రామస్తులు యాత్రికులకు సహాయ సహకారాలు అందించారన్నారు.

డిప్యూటీ ఎంపిడిఒ మంగాదేవి ఆకస్మిక మృతి

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

అమలాపురం డిప్యూటీ ఎంపిడిఒగా విధులు నిర్వర్తిస్తున్న బడుగు మంగాదేవి శనివారం అనారోగ్యంతో ఆకస్మికంగా మృతి చెందారు. ఇటీవల ఆమె తీవ్ర అస్వస్థతకు గురవడంతో మెరుగైన చికిత్స కోసం కాకినాడ మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె ఆరోగ్యం విషమించి శనివారం తుది శ్వాస విడిచారు. పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగ జీవితం ప్రారంభించిన ఆమె డిప్యూటీ ఎంపిడిఒ స్థాయికి వచ్చారు. ఆమె ఆకస్మిక మరణంతో ఉద్యో గులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. గతంలో మల్కిపురం గ్రామపంచా యతీల విస్తరణ అధికారిగా పని చేశారు. అక్కడి కార్యాలయ సిబ్బంది, ఎంపిపి మేడిచర్ల వెంకట సత్యవాణి ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు.

వైద్యం కోసం ఆర్థిక సాయం

ప్రజాశక్తి - రాజోలు

లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న రావులపాలెం మండలం గోపాలపురం గ్రామానికి చెందిన ఈతకోట చిన్నబాబు వైద్య ఖర్చుల కోసం రాజోలుకు చెందిన గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవాసంస్థ రూ.35 వేలు ఆర్థిక సాయాన్ని అందించింది. రాష్ట్ర నెట్ క్యాప్ మాజీ డైరెక్టర్ పాటి శివకుమార్ చేతుల మీదుగా శనివారం అందజేశామని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కట్టా భాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, గోపాలపురం టిడిపి గ్రామ అధ్యక్షులు అధికారి నాగేశ్వరరావు, సొసైటీ ఛైర్మన్ ఓదూరి శివ, తదితరులు పాల్గొన్నారు.

జడ్‌పిటిసి కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఇటీవల మృతి చెందిన మండల జడ్‌పిటిసి మెర్నిడి వెంకటేశ్వర రావు కుటుంబ సభ్యులను జడ్‌పి ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి చిత్రపటానికి ఆయన పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కె.గంగవరం, కాజులూరు, రాయవరం జడ్‌పిటిసిలు ఓబిలినేని వరలక్ష్మి, వనుము వెంకట సుబ్బారావు, నల్లమిల్లి మంగతాయారు, ఎంపిపి అంబటి భవాని పాల్గొన్నారు.

కన్నబాబును పరామర్శించిన నాయకులు

ప్రజాశక్తి - అయినవిల్లి

పితృవియోగంతో బాధపడుతున్న మాజీ మంత్రి కురసాల కన్నబాబును పలువురు పరామర్శించారు. కోనసీమకు చెందిన మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, అంబాజీపేట మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా యువజన విభాగం మాజీ జనరల్ సెక్రెటరీ చెట్ల రామారావు, పి.గన్నవరం మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడు కొండేటి సురేష్‌బాబు, వైసిపి సోషల్ మీడియా యాక్టివిస్ట్ మంద దుర్గారావు, రాయి నందా, యేలేటి వాసు కన్నబాబును కలిసి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

ఛాంపియన్ షిప్ కప్ పోటీలకు సత్య ఎంపిక

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

అమరావతి ఛాంపియన్ షిప్ కప్ పోటీలకు భీమనపల్లి జడ్‌పి ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి దాసరి సత్య ఎంపికయింది. కాకినాడలో జరుగుతున్న జోనల్ స్థాయి పోటీలలో సత్య 800 మీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానం సాధించింది. ఈ సందర్భంగా శనివారం హెచ్ఎం ఎన్.సత్య నారాయణ, ఎస్ఎంసి ఛైర్మన్ జి.చిన్న, పీడీలు మధుసూదనరావు, ప్రసాద్, స్టాఫ్ సెక్రటరీ ఎన్.పద్మనాభన్, ఉపాధ్యాయులు సత్యను అభినందించారు.

వణికించిన వరద

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

గోదావరి వరద జిల్లా ప్రజలను వణికించింది. తగ్గుతూ పెరుగుతూ నానా తంటాలు పెట్టింది. మరోవైపు వాయుగుండం కారణంగా దంచికొట్టిన వర్షాలు ఉమ్మడి జిల్లాను ముద్దచేశాయి. గత నెల వరకూ అనావృష్టితో అల్లాడిన అన్నదాతలు ఈ నెల అతివృష్టితో అతలాకుతలమయ్యారు. ముసురుతో పంటలు ముంపునకు గురై ఇబ్బందులు పడ్డారు. అత్యధిక మండలాల్లో నాట్లు ముంపునకు గురయ్యాయి. రోజులతరబడి నీరు నిలిచిపోవటంతో రైతులకు నష్టాలు తప్పలేదు. మరోవైపు ఎరువుల కొరతతో అన్నదాతలు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. నేటికీ పలుప్రాంతాల్లో ఎరువుల కొరత ఇంకా కొనసాగుతూనే ఉంది. కొన్ని చోట్ల అధికారంలో ఉన్న సొసైటీ ఛైర్మన్లే నేరుగా వ్యవసాయాధికారులను కలిసి ఎరువు కొరత లేకుండా చూడాలంటూ వినతిపత్రాలను సైతం అందించారు. అయినప్పటికీ అధికారులు మాత్రం ఎరువుల కొరత లేదంటూ ప్రకటనలు గుప్పిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో మాత్రం రైతులు ఎరువుల కోసం రైతు భరోసాకేంద్రాలు, సొసైటీలు, ప్రయివేటు దుకాణాల చుట్టూ పడిగాపులు కాస్తునే ఉన్నారు.

కనీస పరామర్శ కరువు

వర్షాలు, వరదల నేపథ్యంలో నిర్వాసితులకు కూటమి నాయకులు పరామర్శ కూడా కరువైంది. పునరవాస కేంద్రాల్లో తలదాచుకుంటున్న వరద బాధితుల స్థితిగతుల గురించి తెలుసుకునే కనీస ప్రయత్నమూ వారు చేయకపోవడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. అధికారులు మాత్రం పునరావాస కేంద్రాలకు అడపా దడపా వెళ్లి వచ్చేశారు. రాజమహేంద్రవరంలో బ్రిడ్జి లంక వాసులు ఇంకా పునరావస కేంద్రలోనే తలదాచుకున్నారు. మరో రెండు మూడు రోజులు వారు ఇక్కడే ఉండే పరిస్థితి నెలకొంది.

ఉచితం... అనుచితం

పిల్లితో చెలగాటం ఎలుకకు ప్రాణ సంకటం అన్న చందంగా ఉచిత బస్సు ప్రయాణం మారింది. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన స్త్రీ శక్తి పథకంలో డొల్లతనం తొలి వారంలోనే బట్టబయలైంది. కొన్ని బస్సులకే ఈ పథకాన్ని వర్తింపజేయడంపై మహిళల్లో వ్యతిరేకతన కనిపిస్తుంది. మరోవైపు ఆటోడ్రైవర్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుంది. అత్యధిక మంది యువత రవాణారంగంపై ఆధార పడి ఉపాధిపొందుతున్నారు. ఆటో, ట్యాక్సీ డ్రైవర్లుగా జీవనం సాగిస్తున్నారు. గడిచిన వారం రోజులుగా ఆటో డ్రైవర్ల పరిస్థితి దయనీయంగా మారింది. రోజంతా కష్టం చేసినా ఆయిల్ ఖర్చులు పోనూ కూలి కూడా గిట్టుబాటు కావటం లేదని వాపోతున్నారు. పట్టణాల్లో పరిస్థితి కొంత మెరుగుగా ఉన్నప్పటికీ పల్లెల్లో ఆటో డ్రైవర్లు ప్రత్యామ్నాయం వైపు చూడక తప్పేలా లేదు.



బార్‌లు బార్లా.

కూటమి ప్రభుత్వం మద్యాన్నే ప్రధాన వనరుగా మలుచుకుంటుంది. అందులో భాగంగా కొత్తగా బార్‌లకు అనుమతులిచ్చింది. అందే కాకుండా బార్‌ల పని గంటలను అర్ధరాత్రి 12 గంటల వరకూ పెంచింది. ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు విన్పిస్తున్నాయి. సంపద సృష్టిస్తామంటూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ఇదేనా? అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే పర్మిట్ రూమ్‌ల వల్ల మద్యం వ్యాపారం ఒక్కసారిగా పెరిగింది. తాజా నిర్ణయంతో ఇక మద్యం ఏరులై పారనుంది.

వికలాంగులకు పింఛన్ ఎగనామం

వికలాంగులకు ఆసరా కోసం అందించే పింఛన్లకు సైతం కూటమి ప్రభుత్వం ఎగనామం పెట్టడం సర్వత్రా విమర్శలు విన్పిస్తున్నాయి. అధికారంలోకొచ్చిన తొలి ఏడాదిలోనే పింఛన్లు పెంచామంటూ ప్రకటనలు గుప్పించిన ప్రభుత్వం ఆచరణలోపూర్తి భిన్నంగా వ్యవహరిస్తోంది. అధికారంలోకివచ్చి 14 నెలలు గడిచినా స్పౌజ్ పింఛన్లు మినహా ఇతర ఎలాంటి పింఛన్లు కొత్తగా మంజూరు చేయలేదు. పైగా అనర్హత పేరుతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 8 వేల మంది వికలాంగ పింఛన్లను తొలగించింది. దీంతో వికలాంగులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. తాజా నిర్ణయంపై ప్రజా ప్రతినిధులు సైతం భాద్యతాయుతంగా స్పందించకపోవడం విమర్శలకు దారితీస్తుంది.

ఇన్‌ఛార్జిని ప్రకటించాలని టిడిపి నేతల నిరసన

ప్రజాశక్తి -కరప

టిడిపి కాకినాడ రూరల్ ఇన్‌ఛార్జిని అధిష్టానం వెంటనే ప్రకటించాలని పలువురు టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. కరప మండలం వేళంగి గ్రామం చంద్రు వెంకన్న చౌదరి ఇంటి వద్ద పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఇన్‌ఛార్జిని ప్రకటించే వరకూ పార్టీ చేపట్టే ఎటువంటి కార్యక్రమాలకూ హాజరు కారాదని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో కోటగిరి మహేంద్ర, కాకర్ల బుచ్చిబాబు చౌదరి, చీపురుపల్లి జయేంద్ర బాబు, గండి వెంకటేశ్వరరావు, మద్దూరి స్వామి, చాత్రా ఇమ్మానియేల్, యనమదల దొరబాబు, తాతపూడి అప్పారావు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న టిడిపి నాయకులు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- తాళ్లరేవు

మహిళలు సాంకేతిక సాధికారతను సాధించాలని భీమాబాయి మహిళా మండలి ముఖ్య కార్యనిర్వహకురాలు వాసంశెట్టి నందివర్ధన అన్నారు. భీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో మహిళలకు, యువతులకు సైబర్ దుర్వినియోగం అంశంపై సాంకేతిక విషయాలపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. డి.దేవిక మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలు ఎటువంటి ముందు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా అన్యాయాలకు గురికాకుండా ఉంటారనే విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ లోవరాజు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

పలుచోట్ల స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర

జిల్లాలో పలుచోట్ల శనివారం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ర్యాలీలు నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

జగ్గంపేట స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ దేవరపల్లి చెన్నారావు మాట్లాడారు. అంటువ్యాదులు, జ్వరాలు, తదితర అనారోగ్యాలను నివారించడానికి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కళాశాల ప్రాంగణాన్ని శుభ్రపరిచారు.


సామర్లకోట జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థునులు పట్నాల లక్ష్మీ శరణ్య, సహస్ర ప్రదర్శించిన ప్రాజెక్టును ముఖ్యమంత్రి చంద్రబాబు, కలెక్టర్ షాన్‌మోహన్ ప్రశంసించారు. వీరు తడి చెత్త, పొడి చెత్త, హానికరమైన చెత్తలను ఆటోమేటిగ్గా వేరు చేసే విధంగా రూపొందించిన ప్రదర్శన ఆకట్టుకుంది. తడి చెత్తను కంపోస్ట్‌గా ప్లాస్టిక్ పేపర్లు తదితరాల రీసైక్లింగ్‌కు పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా ఉందని బాలికలను అభినందించారు. విస్తరణ శిక్షణ కేంద్రంలో శిక్షణలో ప్రిన్సిపల్ ప్రసాదరావు, ఎంపిడిఒలు మొక్కలు నాటారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతో ప్రాణ వాయువు కోసం మండలాల్లో స్వచ్ఛత కార్యక్రమాలు,


తాళ్లరేవు సిహెచ్‌సిలో ప్రతిజ్ఞ చేస్తున్న ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది

మొక్కలు నాటే కార్యక్రమాలు విస్తతంగా చేపట్టాలని శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ ప్రసాదరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప ప్రిన్సిపల్ జి.రమణ, ఎంపిడిఒ శేషుబాబు పాల్గొన్నారు.

కరప డిప్యూటీ ఎంపిడిఒ సలాది శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పంచాయతీ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి భోగి రెడ్డి గంగాధర్ పాల్గొన్నారు. వర్షాకాలంలో అంటువ్యాధుల వ్యాప్తిని అరికట్టడానికి డ్రైన్స్‌లో సిల్ట్ తొలగించడం, నీరు నిల్వ ఉండే దోమల పెంపకం కేంద్రాలను గుర్తించి వాటిని తొలగించడం, యాంటీ లార్వా, ఫాగింగ్ యాక్టివిటీస్ చేపట్టి అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీగా వెళ్లి మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, డ్వాక్రా యానిమేటర్లు పాల్గొనడం జరిగింది.

తాళ్లరేవు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో స్వచ్ఛంద్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ సునీత పరిసరాల పరిశుభ్రత పాటించాలని సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆసుపత్రిలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.


సామర్లకోటలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపల్

డిఎస్‌సిలో పలు విభాల్లో శివకుమార్ ప్రతిభ

ప్రజాశక్తి-రౌతులపూడి


శివకుమార్

బలరామపురానికి చెందిన పైల శివకుమార్ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన డిఎస్‌సి పరీక్షల్లో నాలుగు సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పిజిటి ఫిజికల్ సైన్స్ పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో ఆరో స్థానం సాధించగా, జోనల్‌లో రెండో స్థానంలో నిలిచారు. టిజిజి సైన్స్‌లో రాష్ట్రస్థాయిలో ఐదో స్థానంలో నిలిచి జోనల్ ప్రథమ స్థానం సాధించారు. టిజిటి ఫిజికల్ సైన్స్ పరీక్షలలో జోనల్ తృతీయ స్థానం సాధించగా స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ పరీక్షల్లో ఐదో స్థానంలో నిలిచి నాలుగు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. తొలుత రాష్ట్రీయ మిలటరీ స్కూల్లో అసిస్టెంట్‌గా ఎంపికైన శివకుమార్ బాధ్యతలు స్వీకరించే సమయంలో డిఎస్‌సిలోనూ మెరుగైన ఫలితాలు సాధించడంతో శివకుమార్ కఠోరదీక్ష, పట్టుదలను పలువురు ప్రశంసించారు. ఆయనను ఎంపిటిసి సోమరౌతు రవి, సర్పంచ్ పైలా సీత, సొసైటీ అధ్యక్షుడు పైలా పైడిరాజు, బలరామపురం చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అభినందించారు.

ప్రతిభ చాటిన డిగ్రీ కళాశాల విద్యార్థులు

ప్రజాశక్తి-జగ్గంపేట

ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన నేషనల్ వర్క్ షాప్‌లో గ్రీన్ స్టార్టప్ అనే అంశంపై పోస్టర్ ప్రెజెంటేషన్‌లో జగ్గంపేట డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. అనేక మంది విద్యార్థులతో పాటు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రదర్శన ఇచ్చారు. ఈ ప్రదర్శనలో ద్వితీయ బహుమతి రూ.3 వేలు కైవసం చేసుకుని తమ విద్యార్థులు ప్రతిభను చాటినట్లు ప్రిన్సిపల్ చెన్నారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ సిహెచ్.బాలరాజు ఐక్యూఎసి కో ఆర్డినేటర్ పివివి.సత్యనారాయణ, తెలుగు ఆధ్యాపకులు, డి.సత్యలత, తదితర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నగదు బహుమతిని అందుకుంటున్న విద్యార్థులు

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - అమలాపురం

అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.బేబిరాణి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో యూనియన్ జిల్లా కమిటీ సమావేశం బి.వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలోని అన్ని సెక్టార్ల కమిటీలు వేయాలని, ప్రాజెక్ట్ మహాసభలు తక్షణమే జరపాలని, సెప్టెంబర్ 10వ తేదీ నాటికి ప్రాజెక్ట్ మహాసభలో పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. సభ్యత్వం, కార్మికలోకం ప్రతి సెంటర్‌కి వెళ్లేటట్టుగా బాధ్యత తీసుకోవాలని, ట్రిప్ట్ సొసైటీలో సభ్యులుగా అందర్నీ చేర్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం యాప్‌లో ఆన్‌లైన్ వరకు తగ్గించాలని, మొబైల్ ఫోను ట్యాబ్‌లో ఇవ్వాలని సంఘం నిర్ణయించినట్లు తెలిపారు.